
సాక్షి ఒడిశా

మంగళవారం, 5, మార్చి, 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,93,766లు, వెండి 4గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాష్ట్రంలో పీఎం మోదీ పర్యటన నేడు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు మంగళవారం విచ్చేస్తున్నారు.

- 8లో



చేతబడి నెపంతో గ్రామ బహిష్కరణ

చేతబడి నెపంతో తమ కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించడంతో రోడ్డున పడ్డామని రాయగడ కలెక్టర్‌ మనోజ్‌ సత్యబాన్‌ మహాజన్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

- 8లో

స్వచ్ఛ సాగరం..!











అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా నిలిచిన గోపాల్‌పూర్‌ దగ్గర బొటకేశ్వర తీరంలో సోమవారం స్వచ్ఛ భారత్‌ నిర్వహించారు. గోపాల్‌పూర్‌ ఎన్‌ఏసీ పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సుబదవాని, ఆలివ్‌ రీడ్‌ సురక్ష మంచ్‌, ఈకో ప్రతినిధుల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా బీచ్‌లోని చెత్త, ప్లాస్టిక్‌ బాటిళ్లు తొలగించారు. అందరూ స్వచ్ఛ సాగరానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– బరంపురం

న్యూస్‌రీల్‌

కొండను ఢీకొన్న బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

బరంపురం: గంజాం, గజపతి జిల్లాల సరిహద్దు తప్తపాణి ఘాట్‌ రోడ్డులో కొండను ఒక పెళ్లి బస్సు ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో గంజాం జిల్లా మెగజులి గ్రామం నుంచి మోహన గ్రామానికి పెళ్లి బస్సు బయల్దేరింది. ఈ బస్సు తప్తపాణి ఘాట్‌ రోడ్డుపై ప్రమాదవశాత్తు కొండను ఢీకొంది. ప్రమాదంలో 10 మందికి గాయాలవ్వగా, మరో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఓడ్రాఫ్‌ బృందం సాయంతో క్షతగాత్రులను దిగపహండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యమందించారు. వీరిలో ఆందోళనకరంగా ఉన్నవారిని బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని నాటుసారా స్థావరాలపై ఎస్పీ హరీస్‌ బీసీ ఆదేశాల మేరకు పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. టికిరి పంచాయతీ దొరాగుడ పోలీసుస్టేషన్‌ పరిధి డి.ముర్కా, జి పంజరా ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో 170 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, మరో 1,500 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే మహ్మద్‌ మొకీం ఎన్నిక రద్దు

● హైకోర్టు ఉత్తర్వులు

భువనేశ్వర్‌: కటక్‌ బరాబటి నియోజకవర్గం కాంగ్రెస్‌ ఎమ్మెల్యే మహ్మద్‌ మొకీం ఎన్నికను ఒడిశా హైకోర్టు సోమవారం రద్దు చేసింది. నామినేషన్‌ దాఖలు చేసేటప్పుడు క్రిమినల్‌ కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అఫిడవిట్‌లో వెల్లడించని ఆరోపణ కింద దాఖలైన కేసు విచారణ పురస్కరించుకుని రాష్ట్ర హైకోర్టు ఈ తీర్పు వెల్లడించింది. 2019 ఎన్నికల్లో కటక్‌ బరాబటి శాసనసభ నియోజకవర్గంలో ప్రస్తుత బిజూ జనతా దళ్‌ (బీజేడీ) రాజ్యసభ సభ్యుడు దేబాశిష్‌ సామంతరాయ్‌పై మహ్మద్‌ మొకీం విజయం సాధించారు. అయితే మొకీం దాఖలు చేసిన నామినేషన్‌ దస్తావేజుల్లో నిర్దిష్టంగా నేర సంబంధిత సమాచారం, ఆస్తులకు సంబంధించిన వివరాలను దాఖలు చేయనట్లు 2019 సంవత్సరం జూలై 3న హైకోర్టులో దేబాశిష్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ పురస్కరించుకుని 36 అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పు ప్రకారం ఎమ్మెల్యే మహ్మద్‌ మొకీం పోటీ కోసం నామినేషన్‌ దాఖలు చేసేటప్పుడు అఫిడవిట్‌లో తనపై నమోదైన క్రిమినల్‌ కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించడంలో విఫలమయ్యాడు. ఈ దస్తావేజులను రిటర్నింగ్‌ అధికారి సరిగా తనిఖీ చేయనట్లు హైకోర్టు తీర్పులో పేర్కొంది.

యువకుడికి తీవ్ర గాయాలు



రామ జానిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జయపురం: సబ్‌ డివిజన్‌ బొరిగుమ్మ సమితి రాణిగుడ సమీపంలో రాయి మీద పడడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడు కొరాపుట్‌ పోలీసు స్టేషన్‌ పరిధి మంగరార్‌ రామ జాని(30)గా గుర్తించారు. స్థానికులు అతడిని వెంటనే కొరాపుట్‌ సాహిద్‌ లక్ష్మణ్‌ నాయిక్‌ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సాయంత్రం రామ, మరో వ్యక్తి కలిసి పొలానికి వెళ్లారు. ఆ సమయంలో అకస్మాత్తుగా పొలానికి కొంతదూరంలో మంటలు చెలరేగాయి. ఆ మంటలను ఆర్పేందుకు అక్కడ ఉన్నవారితో పాటు రామ, అతడితో వచ్చిన వ్యక్తి ప్రయత్నించారు. అయితే అక్కడ ఉన్నట్టుండి ఒక రాయి పేలి రామ జానిపై పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడి బంధువులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కొరాపుట్‌ తరలించారు. రాయి పేలడానికి కారణాలు తెలియడం లేదని ఆప్రాంత ప్రజలు చెబుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన



భరతనాట్య నృత్య ప్రదర్శన

బరంపురం: స్థానిక డైమాండ్‌ ట్యాంక్‌ రోడ్డులో జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామివారి 54వ వార్షిక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలుగు కళా సాంస్కృతిక సంస్థలు చేపట్టిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన శ్రీకాకుళం కళాకారులు సునీత, లాలిత్య, బాలజీ, శ్రీనివాస్‌, సురేష్‌, రేష్మల నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. డాన్స్‌ మాస్టర్‌ బి.శివప్రసాద్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు.

ఘుమసరాలో 4,939 జింకలు



రంబా సుబలియాలో సంచరిస్తున్న కృష్ణ జింకలు



బల్లిపదా గ్రామ పొలాల్లో సంచరిస్తున్న జింకలు



కళ్లికోట్‌ రేంజ్‌లో...

బరంపురం: గంజాం జిల్లాలోని దక్షిణ ఘుమసరా అటవీ ప్రాంతంలో కృష్ణ జింకల సంఖ్య పెరిగింది. జిల్లా అటవీ శాఖ అధికారి ఆశిష్‌ కుమార్‌ బెహరా తెలిపిన వివరాల మేరకు.. కళ్లికోట్‌, బరంపురం రేంజ్‌, గుముసర డివిజన్ల పరిధిల్లో 4,939 పైగా జింకలు ఉన్నట్లు గుర్తించారు. 18 ఏళ్ల క్రితం బల్లిగుడా రేంజ్‌లో కేవలం 26 జింకలు ఉండగా ప్రతిఏటా వీటి సంఖ్య పెరుగుతోందన్నారు. అయితే 2013లో వచ్చిన ఫైలిన్‌, తిత్లీ తుఫాన్‌ సమయంలో వందలాది జింకల మృతి చెందాయన్నారు. దీంతో ఆ ఏడాదిలో వీటి సంఖ్య తగ్గినట్లు పేర్కొన్నారు. అనంతరం అప్పటి నుంచి ప్రతి ఏడాది సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. అయితే నీటి ఎద్దడి ఉండడంతో జింకలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. జింకల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

బంద్‌ ప్రశాంతం



రోడ్డుపై మంటలు వేసి నిరసన తెలుపుతున్న ప్రజలు



లక్ష్మీపూర్‌ జంక్షన్‌ వద్ద ప్రజల ఆందోళన

కొరాపుట్‌: లక్ష్మీపూర్‌ను సబ్‌ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన బంద్‌ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం కొరాపుట్‌ జిల్లా లక్ష్మీపూర్‌ పట్టణంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు 12 గంటల బంద్‌ చేపట్టారు. ఉదయమే ప్రజలు లక్ష్మీపూర్‌ జంక్షన్‌ వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో రాయగడ, కొరాపుట్‌ మార్గాలకు వాహనాలు నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై టైర్లు కాల్చి మంటలు వేశారు. వర్తక వాణిజ్య సంస్థలు మూసివేశారు. ముందస్తు ప్రకటనతో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తెరవలేదు.

వాహనాల రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: సబ్‌ డివిజన్‌ పరిధి బొయిపరిగుడ సమితి చంద్రపడ గ్రామం వద్ద మేఘా జల ప్రాజెక్టు సమీపంలో పెద్ద మామిడి చెట్టు ఉండేది. ఆ చెట్టు ఆదివారం రాత్రి గాలులు వీయడంతో విజయవాడ–రాంచీ జాతీయ రహదారిపై పడింది. దీంతో మల్కన్‌గిరి, జయపురం, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, చత్తీస్‌గఢ్‌ ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయాన్ని స్థానికులు బొయిపరిగుడ అగ్నిమాపక విభాగానికి తెలియజేయడంతో, హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకొని చెట్టును నరికి రోడ్డు క్లియర్‌ చేశారు. రెండు గంటలకుపైగా జరిగిన రోడ్డు క్లియరెన్స్‌ పనిలో అగ్నిమాపక సిబ్బంది ఆదిత్య దాస్‌, ఎల్‌ఎఫ్‌ఎం సుకాంత ప్రధాన్‌, డ్రైవర్‌ సురేష్‌ కుమార్‌ హల్వ, అచ్యుత్‌ ఓరమ్‌, శేషదేవ్‌ శబర, తన్మయ సెట్టి, బాసేదేవ్‌ సాహు, ఠాకూర్‌ చలాన్‌, రాజేష్‌ ప్రధాన్‌లు పాల్గొన్నారు. అనంతరం వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

‘విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి’



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కొండబాబు

రాయగడ: విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందని బీజేడీ సీనియర్‌ నాయకుడు ఎల్ల కొండబాబు అన్నారు. స్థానిక కస్తూరీనగర్‌లోని మథర్‌ థెరిస్సా పాఠశాల 17వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సాహించాలన్నారు. విద్యావేత్త డాక్టర్‌ డీకే మహంతి మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారు ఆసక్తి కనబరిచే రంగంలో ప్రోత్సహించడం విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠాలు చెప్పే గురువులపై ఉందన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మదర్‌ థెరిస్సా ఎడ్యుకేషనల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ బుడ్డా శంకర రావు మాట్లాడుతూ తమ ట్రస్ట్‌ ద్వారా రెండు విద్యా సంస్థలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. పది మంది పిల్లలతో ప్రారంభించిన ప్రస్థానం ప్రస్తుతం అందరి సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిదని తెలియజేశారు. పేద విద్యార్థులకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ జై చంద్ర చౌదరి, గౌరవ అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్‌.శాంతా రావు, గోపాల్‌ కృష్ణ పాలో తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు తల్లిదండ్రులు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఎన్నికలకు సమాయత్తం

● నగరంలో ఫ్లాగ్‌ మార్చ్‌



సీఏపీఎఫ్‌ జవాన్లకు సూచనలిస్తున్న అధికారులు

భువనేశ్వర్‌: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని శాఖల అధికారులు సమాయత్తమవుతున్నారు. దీనిలో భాగంగా నగర వీధుల్లో కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్‌) సోమవారం ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించింది. స్థానిక రాజ్‌మహల్‌ స్క్వేర్‌ నుంచి శిశు భవన్‌ స్క్వేర్‌ వరకు ఒక కంపెనీ సీఏపీఎఫ్‌ జవాన్లు మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ దళం జవాన్లలో అస్సాం రైఫిల్స్‌, సరిహద్దు రక్షణ దళం (బీఎస్‌ఎఫ్‌), కేంద్ర రిజర్వ్‌ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్‌), కేంద్ర పారిశ్రామిక రక్షక దళం (సీఐఎస్‌ఎఫ్‌), ఇండో టిబెటు సరిహద్దు పోలీసు (ఐటీబీపీ), ఎన్‌ఎస్‌జీ, ఎస్‌ఎస్‌బీ వర్గాలకు చెందినవారు ఉన్నారు. నేరస్తులు, సంఘవిద్రోహ వ్యక్తుల కార్యకలాపాలకు చెక్‌ పెట్టేందుకు ఈ సెక్యూరిటీ డ్రిల్‌ నిర్వహించినట్లు అధికార వర్గాల సమాచారం.

ప్రతివారం ఫ్లాగ్‌ మార్చ్‌

రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ముగిసేంతవరకు కేంద్ర సాయుధ పోలీసు దళం వారానికి 2, 3 సార్లు ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహిస్తుందని అధికారులు తెలియజేశారు. ప్రధానంగా బస్తీలు, పరిసర ప్రాంతాల నివాసితులపై భద్రతా దళాలు దృష్టి సారిస్తాయని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల శాంతిభద్రతల నిర్వహణ కోసం తొలి దశలో రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఇప్పటికే 15 కంపెనీల సీఏపీఎఫ్‌ జవాన్లని మోహరించారు. రెండో దశలో మరో 50 కంపెనీల భద్రతా బలగాలు రాష్ట్రానికి రానున్నాయి. ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా 3.4 లక్షల మంది సీఏపీఎఫ్‌ జవాన్లను మోహరించాలని ఎన్నికల సంఘం కోరింది.



ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహిస్తున్న దృశ్యం



అవగాహన సదస్సులో పాల్గొన్న సీఏపీఎఫ్‌ జవాన్లు

సాయుధ దళాలతో సమీక్ష

కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్‌), జిల్లా పోలీసు అధికారుల సమక్షంలో ఎన్నికల రక్షణ, భద్రత చర్యల సన్నద్ధతపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. కటక్‌ జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కటక్‌ నగర డీసీపీ, సీఆర్‌పీఎఫ్‌ కమాండెంట్‌ తదితర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల భద్రత, రక్షణ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకోనున్న జవాన్లకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

చిరుత పులి చర్మం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పులి చర్మం

భువనేశ్వర్: రాష్ట్రంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీసులు చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కందమాల్ జిల్లాలో ఒకరిని అరెస్టు చేశారు. చిరుత పులి చర్మం గురించి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి ఎస్టీఎఫ్ బృందం ఆదివారం రాత్రి జిల్లాలోని ఫిరింగియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణిపదర్ గ్రామ సమీపంలో ఒక స్థలంలో దాడి చేసింది. ఈ దాడిలో కుర్కనపల్లి (కెలాపాడా)కు చెందిన నిందితుడు బెలార్సెన్ కన్హర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సోదాల్లో అతని వద్ద నుంచి చిరుతపులి చర్మం, రూ.5,500 నగదుతోపాటు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. చిరుత పులి చర్మానికి సంబంధించి నిందితుడు ఆధారాలు చూపించకపోవడంతో అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వన్యప్రాణుల (రక్షణ) చట్టం -1972 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్టీఎఫ్ వర్గాలు తెలిపాయి. చర్మాన్ని జీవశాస్త్ర పరీక్ష కోసం డెహ్రాడూన్‌కు పంపిస్తారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో రక్తదానం శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అడిషనల్ చీఫ్ ఆఫీసర్ దనేశ్వర్ మహాపాత్రో మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని తెలియజేశారు. రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. శిబిరంలో మొత్తం 15 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లు

పాతపట్నం: నియోజకవర్గంలోని పాతపట్నం, కొసమాల(మెళియాపుట్టి), గొప్పిలి పీఏసీఎస్ పరిధిలోని మూడు చోట్ల మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో వీటిని ఏర్పాటు చేశారు. పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలతో షెడ్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. అలాగే మెళియాపుట్టి మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలు, గొప్పిలిలో రూ.40లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు. ఈ భవనాలు పూర్తయితే ఒక్కో భవనంలో రైతులకు 500 మెట్రిక్ టన్నుల స్టోరేజ్ చేసుకోవచ్చునని మార్కెట్ శాఖ డీఈఈ ఈ కోటయ్య తెలిపారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు పాతపట్నం, మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపడుతున్నామని పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్‌పోస్టులో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారని, ఒక్కో చెక్‌పోస్టు వద్ద ఒక ఎస్‌ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను నియమించామన్నారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, ఆంధ్ర నుంచి వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు.

మహిళకు మూడేళ్ల జైలు శిక్ష

పొందూరు: మండలంలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన ఓ మహిళపై రాజాం కోర్టులో నేరారోపణ రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎం.బాబు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఆ మేరకు ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. లోలుగు గ్రామానికి చెందిన రాంబోతు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఉషకిరణ్ వాదనలు వినిపించారని పొందూరు సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 300 మద్యం సీసాలు సీజ్

పొందూరు: మండలంలోని బాణాం గ్రామం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 300 మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. మద్యం సీసాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు.. ఎస్ఈబీ ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో దాడి చేసి బాణాం సమీపంలో ద్విచక్ర వాహనంపై 300 మద్యం సీసాలను తరలిస్తున్న పెద్దింటి ముకుందరావును పట్టుకున్నారు. మద్యం సీసాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రంలో పీఎం మోదీ పర్యటన నేడు

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



భద్రతా వలయంలో బహిరంగ సభా ప్రాంగణం

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు మంగళవారం విచ్చేస్తున్నారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో 3 రోజుల పర్యటనలో భాగంగా, ఆయన రాష్ట్రంలో జాజ్‌పూర్ ప్రాంతం సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో రూ.1,10,600 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. రాష్ట్రంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ప్రధాని మంగళవారం రాష్ట్రానికి చేరుకుని జాజ్‌పూర్ జిల్లా చండీఖోల్ ప్రాంతంలో బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రూ.19,600 కోట్లకు పైగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపనలు చేయనున్నారు. చమురు, గ్యాస్, రైల్వేలు, రహదారి, అణుశక్తి రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఉన్నాయి. చండీఖోల్‌లో జరిగే అధికారిక కార్యక్రమానికి కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్ హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

సభా ప్రాంగణంలో పటిష్ట భద్రత

ప్రధాని ఒడిశా పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఆయన బహిరంగ సభ వేదిక వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పర్యటన కోసం మొత్తం 12 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. విమానాశ్రయాన్ని హై సెక్యూరిటీ జోన్‌లో ఉంచారు. జాజ్‌పూర్‌లో తాత్కాలిక హెలిప్యాడ్‌ను తయారు చేశారు. రాష్ట్ర తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్‌కుమార్ షడంగి ఒడిశాలో మోదీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. భువనేశ్వర్ చేరుకున్న తర్వాత హెలికాప్టర్‌లో జాజ్‌పూర్‌కు వెళ్లారు. దీంతో ఎస్పీజీ బృందం జాజ్‌పూర్‌కు చేరుకుని భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసింది. సెంట్రల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆశిష్ సింగ్, జాజ్‌పూర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్

ప్రధానమంత్రి మోదీ రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని సమగ్రంగా 3 గంటల 10 నిమిషాల పాటు జాజ్‌పూర్ జిల్లా ప్రాంతంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మంగళవారం మధ్యాహ్నం 2.40 గంటలకు భువనేశ్వర్ విచ్చేస్తారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఎంఐ-17 హెలికాప్టర్‌లో జాజ్‌పూర్ జిల్లాలోని చండీఖోల్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు చండీఖోల్ ప్రాంతంలో పలు బహిరంగ సభ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.15 నుంచి 5 గంటల వరకు చండీఖోల్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు. అనంతరం సాయంత్రం5.50గంటలకు కోల్‌కతాకు పయనమవుతారు.

జగన్నాథుని ఆలయంలోకి అన్య మతస్తులు



పోలీసుల అదుపులో ఉన్న బంగ్లాదేశీయులు



స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్టులు

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం పూరీ శ్రీ జగన్నాథ ఆలయంలోకి ఆదివారం అన్య మతస్తుల బృందం ప్రవేశించింది. ఈ పరిస్థితిపై సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఆలయ భద్రత వ్యవస్థ డీలా పడిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆలయంలోకి ప్రవేశించిన వారిలో బంగ్లాదేశీయులు ఉన్నట్లు గుర్తించారు. పూరీ సింహద్వారం ఠాణా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 9 మంది వ్యక్తుల బృందం పూరీ సందర్శనకు విచ్చేసింది. వీరిలో నలుగురు వ్యక్తులు ఆలయంలోకి వెళ్లి రత్న వేదికపై కొలువుదీరిన దేవతామూర్తులను దర్శించుకున్నారు. మిగిలిన 5 మంది ఆలయం వెలుపల ఉండిపోయారు. ఆలయంలోనికి వెళ్లిన వారు దర్శనం చేసుకున్న తర్వాత ఆనంద బజారులో మహా ప్రసాదం కొనుగోలు చేశారు.

స్థానికుల్లో సందేహం

ఆలయం బయట తచ్చాడుతున్న వారిపై స్థానికుల దృష్టి పడింది. వీరి పోకడపై ఒకింత సందేహం కలిగి వారి వివరాలను ఆరా తీసేందుకు ప్రయత్నించారు. స్థానికుల్లో సందేహం మరింత బలపడి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకుని వెళ్లారు. సందర్శకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఆలయంలోకి వెళ్లిన వారిలో ఒకరు హిందువు అని ఇతరులు హిందూయేతరులుగా గుర్తించారు. వీరి దగ్గర నుంచి బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

104 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పెప్పరమెట్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి పెప్పరమెట్ల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక ట్రాక్టర్‌ను ఆపి తనిఖీలు నిర్వహించగా నాలుగు బస్తాల్లో గంజాయి బయటపడింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకొని, ట్రాక్టర్‌లో ఉన్నటువంటి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు విచారణలో నిందితులు తెలియజేశారు. అరెస్టైనవారిలో పెప్పరమెట్ల గ్రామానికి చెందిన హర్ ఖేముండు, ఉదయ్ ఖేముండు, రవి ఖేముండు, గణపతిలు ఉన్నట్లు నిర్ధారించారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 104 కేజీలు ఉంది. ఈ గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క తెలిపారు.

జేకేపూర్‌లో భద్రతా వారోత్సవాలు



మాట్లాడుతున్న చిత్తరంజన్ బెవుర

రాయగడ: సదరు సమితి పరిధి జేకేపూర్‌లోని పేపర్ మిల్ కంపెనీ ప్రాంగణంలో జాతీయ భద్రతా వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్యాక్టరీస్ అండ్ బొయిలర్స్ డిప్యూటీ డైరక్టర్ చిత్తరంజన్ బెవురా పాల్గొని ప్రసంగించారు. కర్మాగారంలో భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతీ ఏడాది కంపెనీలో భద్రతపరమైన జాగ్రత్తలను పాటించడంతో పాటు కార్మికులకు అన్నివేళలా చైతన్యపరిచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కర్మాగారం సేఫ్టీ అధికారి రాంరంజన్ బిశ్వాల్ తెలియజేశారు. కార్యక్రమంలో జేకే పేపర్ మిల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎంఆర్‌కే రాయ్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జీసీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ఏడుగురు మహిళలు అరెస్టు



అరెస్టైన మహిళలు

మల్కన్‌గిరి:

జిల్లాలోని కలిమెల సమితి కేంద్రంలో ఉన్నటువంటి పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో చోరీకి పాల్పడిన తెలంగాణకు చెందిన ఏడుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన మహిళలు కలిమెలలో పగటి సమయంలో గిన్నెలు తదితర సామగ్రి అమ్ముకుంటూ వేర్వేరు స్థావరాల్లో తలదాచుకునేవారు. ఈ నేపథ్యంలోనే స్థానిక పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది ఎవరూ ఉండరని గమనించి, సిలెండర్లు, పైపులు దొంగలించేందుకు యత్నించారు. అయితే స్థానికంగా ఉన్నటువంటి ఒక మహిళ చూసి వెంటనే కార్యాలయం అధికారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. సంబంధింత గోదాం తాగునీటి సరఫరా శాఖకు సంబంధించినది కావడంతో ఆ శాఖ ఇంజినీర్ సుకుమార్ ప్రధాన్ కలిమెల పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో వెళ్లి చోరీకి పాల్పడుతున్న మహిళలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగలించిన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో వరంగల్ జిల్లా బంజారుపల్లి గ్రామానికి చెందిన దాసరి నాయమ్మ, కరీంనగర్ జిల్లా సిరిపురం పోలీసుస్టేషన్ పరిధి దుబ్బపల్లి గ్రామానికి చెందిన దాసరి రెబికా, కరీంనగర్ జిల్లా సిరిపురం పోలీసుస్టేషన్ పరిధి దుబ్బపల్లి గ్రామానికి కందల సుబ్రత, కొత్తగూడెం జిల్లా చీరాల పోలీసుస్టేషన్ పరిధి చీరాల గ్రామానికి చెందిన కందల మహేశమ్మ, కొత్తగూడెం జిల్లా చీరాల పోలీసుస్టేషన్ పరిధి చీరాల గ్రామానికి చెందిన కందల తిరుపతమ్మ, మంచిర్యాల జిల్లా ఉట్కూరు పోలీసుస్టేషన్ పరిధి లక్ష్యయిపేట గ్రామానికి చెందిన బల్లని వెంకటమ్మ, వరంగల్ జిల్లా ములుగు పోలీసుస్టేషన్ పరిధి జనగాపల్లి గ్రామానికి చెందిన వనం రేణుక ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో సోమవారం హాజరుపరిచారు.

చేతబడి నెపంతో గ్రామ బహిష్కరణ

- కలెక్టర్‌కు బాధిత కుటుంబ సభ్యులు వినతి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మహాజన్, పక్కనే ఎస్పీ హరీష్ బిసి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన జియాన కుటుంబ సభ్యులు

రాయగడ: చేతబడి నెపంతో తమ కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని కలెక్టర్ మనోజ్ సత్యబాన్ మహాజన్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో బాధిత కుటుంబం తమ గోడు వినిపించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కొలనార సమితి నందొబడి గ్రామంలో జియాన పులక అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో ఉన్నటువంటి కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం గ్రామంలో ఒక యువకుడు మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ఆ యువకుడిని చేతబడి చేసి హతమార్చావంటూ జియానను తరచూ వేధిస్తుండేవారు. ఈ క్రమంలో మార్చి ఒకటో తేదీన గ్రామస్తులంతా కలిసి అతడి ఇంటిపై దాడిచేసి గ్రామం నుంచి తరిమేశారు. అదేరోజు సాయంత్రం చందిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో దిక్కుతోచక తమ బంధువులు ఉంటున్న అమలాభట్టలో తలదాచుకున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను గ్రామంలోకి అనుమతించేలా, అదేవిధంగా గ్రామస్తుల నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ మహాజన్ ఎస్పీతో మాట్లాడి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అంధకారంలో గ్రామం

వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కాసీపూర్ సమితి సరిపాయి పంచాయతీలోని కురఖా గ్రామస్తులు తమ సమస్యలు విన్నవించారు. గ్రామంలో సమారు 15 కటుంబాలు నివసిస్తున్నాయని, ఇంతవరకు తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గతేడాది గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వంటివి సంబంధిత శాఖ ఏర్పాటు చేసినప్పటికీ, పనులు ముందుకు సాగలేదని వాపోయారు. దీంతో స్పందించిన కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ హరీష్ బిసి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ నిహారి రంజన్ కుహరో, సబ్ కలెక్టర్ కల్యాని సంఘమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ స్టేడియంకు మంచి రోజులు



కోడిరామ్మూర్తి స్టేడియ ప్రాంగణంలో కొనసాగుతున్న 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ పనులు

- రూ.12 కోట్లతో టెండర్లు పిలవడంతో త్వరలో పూర్తిస్థాయిలో పనులు మొదలు
- ఇప్పటికే మొదలైన రన్నింగ్ ట్రాక్ పనులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలోని ప్రతిష్టాత్మక కోడి రామ్మూర్తి స్టేడియంకు మంచి రోజులు వచ్చాయి. స్టేడియం ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో మొదలు కానున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కేఆర్ స్టేడియంలో నిలిచిపోయిన పనులకు అవసరమయ్యే రూ.12 కోట్ల నిధులను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు పరిపాలనాపరమైన అనుమతులు సైతం మంజూరు చేసింది. తాజాగా టెండర్లు కూడా పిలవడంతో అతిత్వరలో పనులు మొదలు కానున్నాయి.

గతమెంతో ఘనం.. గత పాలకుల శాపం

1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతులమీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రారంభమైంది. మల్టీపర్పజ్ స్టేడియంగా అన్ని క్రీడలను ఆడే విధంగా అవకాశం కల్పించారు. సుమారు 17వేల మంది ప్రేక్షకులు పోటీలను తిలకించేలా గ్యాలరీలను నిర్మించారు. దానికి మరికొన్నాళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడాంశాలకు ఉపయుక్తంగా కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంను సైతం నిర్మించారు. వందలాది మంది అంతర్జాతీయ, జాతీయస్థాయి ఆటగాళ్లతోపాటు శ్రీకాకుళంను ప్రపంచపటానికి పరిచయం చేసిన కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ వంటి క్రీడాకారిణులు ఓనమాలు దిద్దుకున్నది కోడిరామ్మూర్తి స్టేడియంలోనే. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం స్టేడియం నిర్మాణాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. గత పాలకుల పాపం క్రీడాకారుల పాలిట శాపంగా మారిపోయింది.



ప్రత్యేకంగా సిద్ధమవుతున్న 100 మీటర్ల ట్రాక్

కమీషన్ల కోసం అచ్చెన్న కక్కుర్తి.. పనులకు శాపం

2016 మే 2వ తేదీన స్వయంగా నాటి సీఎం చంద్రబాబునాయుడు స్టేడియం పనులకు శిలాఫలకం వేసి వదిలేశారు. దానికి దాదాపు రెండేళ్ల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టుల కేటాయింపులో నాడు క్రీడల మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు అన్నీ తానై చక్రం తిప్పారు. కమీషన్ల కోసం తమకు అనుకూలమైనవారికే కాంట్రాక్టు పనులను కట్టబెట్టారు. దీంతో పనులు నత్తనడకన సాగేవి.

ధర్మాన కృషి.. సీఎం చొరవ..

2022 జూన్ 27వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇదే స్టేడియం వేదికగా అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. అదే వేదికపై స్టేడియం పునర్నిర్మాణానికి ధర్మాన కోరిక మేరకు రూ.12 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా టెండర్లను పిలిచారు. దీంతో మరికొద్దిరోజుల్లో క్రీడాకారుల కష్టాలకు చెక్ పడనుంది.

రన్నింగ్ ట్రాక్ పనులు మొదలు

స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. 400 మీటర్ల పటిష్టమైన రన్నింగ్‌ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. 8 లైన్లతో ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 100 మీటర్ల ట్రాక్‌ను సైతం ఇందులో భాగంగానే ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. చి ప్స్, ఇసుక, మట్టి ఇలా మూడు లేయర్లతో ట్రాక్‌ను పూర్తిచేయనున్నారు. మరికొద్ది రోజుల్లో రన్నింగ్ ట్రాక్‌ను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే మేం ఉన్నాం

- గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో మంత్రి అప్పలరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజలు చెప్పే సమస్యలను పరిష్కరించేందుకే తాము ఉన్నామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన అక్కుపల్లి గ్రామంలో సోమవారం 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉద్దానం, తీర ప్రాంతంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు రూ. 100 కోట్లు వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు రూ.700 కోట్లతో ఇంటింటికి శుద్ధజలం అందించే పథకాన్ని సీఎం వైఎస్ జగన్ నిర్మించారని అన్నారు. నాడు-నేడు పథకం ద్వారా బడులను ఆధునికీకరించి పిల్లలకు అన్ని సదుపాయాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం ప్రభుత్వ పాలన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా చేరువ చేశారని చెప్పారు. ఆయనను మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కోనేటిరాయుడికి కోటి దండాలు



పొన్నచెట్టు వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవాసుదేవుడు

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి పొన్నచెట్టు వాహనంలో ఊరేగారు. శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి అని శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన భక్తి కీర్తనలకు భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం గోపాలసాగరంలో స్వామి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

\- మందస

విద్యా ప్రాప్తిరస్తు..!

- బీసీ విద్యార్థులకు 'సువర్ణావకాశం'
- ఎంజేపీఏపీ బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల
- జిల్లాలో మూడు బాలికలు, నాలుగు బాలుర పాఠశాలలు
- 440 మంది విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశాలకు అవకాశం
- ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎంట్రన్స్ పరీక్ష ద్వారా ప్రవేశాలు

పాఠశాల	సీట్ల సంఖ్య
1) నెల్లిమర్ల(బాలికలు) (ఇంటర్మీడియట్-140సీట్లు)	80
2) నెల్లిమర్ల (మత్స్యకార బాలురు)	40
3) గజపతినగరం (బాలురు)	80
4) గంట్యాడ(బాలికలు)	80
5) విజయనగరం(బాలురు)	40
6) కొత్తవలస(బాలికలు)	40
7) బొబ్బిలి(బాలురు)	80



నెల్లిమర్లలోని ఎంజేపీఏపీ పాఠశాల

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడు పాఠశాలల్లో మొత్తం 440 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలను అధికారులు తాజాగా ప్రకటించారు.

జిల్లాలో ఏడు పాఠశాలలు..440 సీట్లు

జిల్లావ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో మూడు బాలికల పాఠశాలలు కాగా, నాలుగు బాలుర పాఠశాలలు. బాలుర పాఠశాలల్లో నెల్లిమర్ల పట్టణంలో ఉన్న పాఠశాల పూర్తిగా మత్స్యకార బాలుర కోసం కేటాయించింది. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతిలో మొత్తం 440 సీట్లు భర్తీ చేయనున్నారు. నెల్లిమర్ల బాలికలు, గజపతినగరం బాలురు, గంట్యాడ బాలికలు, బొబ్బిలి బాలుర పాఠశాలల్లో 80 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి, నెల్లిమర్ల మత్స్యకార బాలురు, విజయనగరం బాలురు, కొత్తవలస బాలికల పాఠశాలల్లో 40 చొప్పున సీట్లున్నాయి. నెల్లిమర్ల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 140 సీట్లు కేటాయించారు. వాటిలో ఎంపీసీ-60,బైపీసీ -40,సీఈసీ-40 సీట్లు ఉన్నాయి.

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు

గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదోతరగతి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించేవారు. 4వ తరగతి స్థాయిలో పరీక్ష ఉంటుంది. తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయి. తెలుగు-10, ఇంగ్లీషు-10, లెక్కలు-15, సైన్స్, సోషల్ కలిపి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్షకు రెండు గంటల సమయం కేటాయిస్తారు. విద్యార్థులు జవాబులను ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాల్సి ఉంటుంది. జిల్లా అంతా ఒక యూనిట్‌గా ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు.

సీట్ల భర్తీలో రిజర్వేషన్లు

పాఠశాలల్లోని మొత్తం సీట్లలో 74 శాతం బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించింది. బీసీ-ఎ విద్యార్థులకు 20శాతం, బీసీ-బి విద్యార్థులకు 28 శాతం, బీసీ-సి విద్యార్థులకు 3 శాతం, బీసీ-డి విద్యార్థులకు 19 శాతం, బీసీ-ఈ విద్యార్థులకు 4 శాతం సీట్లు కేటాయించారు. ఎస్సీ విద్యార్థులకు 15శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, అనాథ విద్యార్థులకు 3 శాతం సీట్లు ఈబీసీ/ఇతర కులాల విద్యార్థులకు 2 శాతం రిజర్వ్ చేశారు. మత్స్యకార బాలుర పాఠశాలలో 46 శాతం సీట్లను మత్స్యకార విద్యార్థులతోనే భర్తీచేస్తారు. 29 శాతం సీట్లను బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు, 15 శాతం సీట్లను ఎస్సీ, 6శాతం సీట్లను ఎస్టీ, 3శాతం అనాథ విద్యార్థులకు, 1 శాతం ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు కేటాయించారు.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. ఈ జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరంతరాయంగా (2022-23, 2023-24) చదివి ఉండాలి. బీసీ, ఈబీసీ విద్యార్థులు 1.9.2013-31.8.2014 మధ్య జన్మించి, 9నుంచి 11 సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.9.2012-31.8.2016 మధ్య జన్మించి, 9 నుంచి 13 సంవత్సరాల వయసు వారై ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల సంవత్సర ఆదాయం ఏడాదికి రూ.లక్షకు మించరాదు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసు కోవాలి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి/సంరక్షకుడి మొబైల్ నంబరు తదితర ప్రాథమిక వివరాలతో రూ.100 చెల్లిస్తే జర్నల్ నంబర్ వస్తుంది. ఆ నంబర్ ఆధారంగా హెచ్‌టిటిపిఎస్://ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఏపీసీఎఫ్‌ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పంపిన తరువాత వచ్చే రిఫరెన్స్ నంబరుతో దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకోవాలి. పాఠశాలలకు నేరుగా అందజేసే దరఖాస్తు పరిగణనలోకి తీసుకోరు. ఈనెల 1నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



జిల్లాలోని ఎంజేపీఏపీ గురుకుల పాఠశాలలు పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నాయి. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశాం. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ పరీక్ష ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తాం. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదోతరగతికి, పదోతరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 1 నుంచి 31వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్.రమామోహిని, గురుకులాల జిల్లా కన్వీనర్, విజయనగరం

క్లుప్తంగా

5,6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఏఐ-పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ పేరుతో ఈ ఏడాది జూలై 5, 6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కాలంలో వివిధ రంగాలలో పెరుగుతున్న కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం, తద్వారా పర్యావరణ, సామాజిక అభివృద్ధిలో దాని కీలకపాత్రను దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సు నిర్వహించనున్నామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు మానవాళి మనుగడకు దోహదపడే అంశాలను చర్చించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, పరిశోధనలకు విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి, ఇటీవల సాధించిన పురోగతులను చర్చించడానికి ఈ సదస్సు అంతర్జాతీయ వేదిక అవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంఆర్ఐటీ.ఈడీయు.ఐఎన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోల మన్మథకుమార్, తదితరులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకూ విశాఖ జిల్లా కేంద్ర వేదికగా జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలతో జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో బి.సచిన్ బంగారు పతకం సాధించగా, పి. దుర్గాప్రసాద్ , ఎస్.దేవకిలు రజత పతకాలు దక్కించుకున్నారు. బంగారు పతకం సాధించిన సచిన్ ఈ నెల 18 నుంచి 25 వరకూ ఉత్తర్ ప్రదేశ్ నోయిడాలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోల మన్మథకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు రాజు, పీఎల్.ప్రసాద్, గోరీ, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్ నాయుడు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మత్స్యకారుడి మృతి

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి ఎర్రయ్య (68) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనిపై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 29న ఎర్రయ్య తన తోటి మత్స్యకారులతో కలిసి ముక్కాం సముద్రంలో వేటకు వెళ్లాడు. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోగా తలకు బలమైన గాయలయ్యాయి. విషయం గమనించిన తోటి మత్స్యకారులు ఎర్రయ్యను బయటకు తీసి హుటాహుటిన సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని కుమార్తె బోగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాతారావు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలో రైతులు ఆకలి తౌడు, దావాల ముత్యాలనాయుడులకు సంబంధించిన గడ్డివాములు సోమవారం దగ్ధమైనట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా ఎవరో సిగరెట్ పీకను గడ్డివాములపై విసిరేయడంతో ప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదం లో సుమారు రూ.30వేల ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

చెరకు, నీలగిరితోటలు దగ్ధం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామానికి చెందిన కేతిరెడ్డి పొలంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెరకు, నీలగిరి తోటలు కాలిపోయాయి. ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలియనప్పటికీ ఆకతాయిలు కొంతమంది ఎయిర్‌స్ట్రిప్‌ను ఆనుకుని ఉన్న మామిడి, నీలగిరి తోటల్లో మద్యం తాగి కాల్చి పడేసిన సిగరెట్ రవ్వలమూలంగా ఆకులు అంటుకుని ప్రమాదం జరిగిఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కేతిరెడ్డి పొలంలో తెంటుపోలి నాయుడు, రెడ్డి పాపినాయుడు, తీళ్లశంకరరావు, చిట్టిచిన్నం నాయుడులకు చెందిన సుమారు 10 ఎకరాలలో చెరకు తోటలు కాలిపోయాయి. అలాగే గాలిబాగా వీయడంతో ఎయిర్‌స్ట్రిప్‌కు దక్షిణ భాగాన ఉన్న సుమారు 10 ఎకరాల్లో నీలగిరితోటల్లో కూడా మంటలు ప్రవేశించి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హాజరై మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తినష్టం లక్షల్లో ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

వన్నె తగ్గని పుస్తకంతో విజ్ఞానం మెండు

- ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర

విజయనగరం: అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ పుస్తకం వన్నె తగ్గదని, విజ్ఞానమే ఆపాదమస్తకమని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర అన్నారు. సంఘం విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ అధ్యక్షతన సీతం ఇంజినీరింగ్ కళాలలతో సంయుక్తంగా సోమవారం నిర్వహించిన విద్యార్థులు-గ్రంథాలయాలు-పుస్తకాల ప్రాముఖ్యత అనే సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ పుస్తకాలే సమాజాన్ని జ్ఞానవంతంగా తీర్చిదిద్దుతాయని, మంచి సమాజ నిర్మాణానికి పుస్తకాలే అసలుసిసలైన పనిముట్లుగా పనిచేస్తాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకం మనిషిని కదిలిస్తుంది, పుస్తకం మనిషిని నడిపిస్తుంది, పుస్తకం వ్యవస్థలను కదిలిస్తుందని, అస్తవ్యస్త వ్యవస్థలను సరిదిద్ది మంచి వ్యవస్థలను ప్రతిష్టించే శక్తి కలిగి ఉన్నది పుస్తకమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన పి.జ్ఞాన ప్రసూన, బి.సుష్మలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ కల్కూరను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, కళాశాల చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎల్ సత్యవతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ లైబ్రేరియన్ నారాయణ, గ్రంథాలయ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళి విద్యార్థులకు నాలుగో స్థానం

- ఈఎండీపీలో అగ్రి-రోబోట్ ప్రాజెక్ట్ ప్రదర్శన
- అభినందించిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి

తెర్లాం: ఈఎండీపీ(ఎంటర్ ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)లో పెరుమాళి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి ఆకాంక్షించారు. ఈ నెల 2 జిల్లాస్థాయిలో జరిగిన ఈఎండీపీలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అగ్రి-రోబోట్ ప్రాజెక్ట్ జిల్లాస్థాయిలో టాప్-4లో నిలిచింది. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్, ప్రాజెక్ట్ ట్రైనర్ అధ్యాపకుడు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన ఈఎండీపీ ప్రాజెక్ట్ ప్రదర్శనకు జిల్లా నుంచి 256 ప్రాజెక్ట్స్ ప్రదర్శనకు వచ్చాయన్నారు. వాటిలో తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు జి.దేవిశ్రీ ప్రసాద్, వి.కార్తీక్‌లు అగ్రిరోబోట్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించించి టాప్-4లో నిలవడం ఆనందంగా ఉందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన అగ్రి రోబోట్ ప్రాజెక్ట్ త్వరలో జరగనున్న రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనలో టాప్-1లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారిని ట్రైన్ చేసిన అధ్యాపకుడు టి.లక్ష్మణ్‌ను ఆమె అభినందించారు.

రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రత ముఖ్యం


సబ్‌జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జైళ్ల శాఖ జిల్లా అధికారి బి.కృష్ణారావు

- జైళ్ల శాఖ జిల్లా అధికారి

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం కల్పించాలని జైళ్ల శాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి బి.కృష్ణారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పాలకొండ సబ్‌జైల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఆ సందర్భంగా అక్కడ రిమాండ్ ఖైదీల వివరాలు, రికార్డుల నిర్వహణ, జైల్ అంతర్గత పరిసరాల పరిశుభ్రతపై సూరింటెండెంట్ బి.జోగులు ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ వారికి మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం, వేసవి నేపథ్యంలో అవసరమయ్యే సూచనలు చేశారు. కేసుల వివరాల మేరకు బెయిల్‌పై వెళ్లేందుకు న్యాయవాదుల ఆవశ్యకతపై వివరించారు. సిబ్బంది నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని, యూనిఫాం తప్పనిసరిగా వాడాలని స్పష్టం చేశారు. ఆయన వెంట హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్, వార్డర్లు నాగరాజు, హేమసుందర్, నరసింహులు తదితరులున్నారు.

బాక్సింగ్‌లో పతకాలు


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్.కె.శాంతికుమారి, కె.దివ్యశ్రీలు విశాఖపట్నంలో ఏపీ బాక్సింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలలో రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీడీ శివరాంప్రసాద్, బాక్సింగ్ కోచ్ కుద్దాన సోమేష్‌లు సోమవారం అభినందించారు.

గూడ్స్ ఢీకొని విద్యార్థి మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో గూడ్స్ ఢీకొని ఓ కళాశాల విద్యార్థి ఆరిశెట్టి హిమగిరి(20) మృతి చెందినట్లు పలాస రైల్వే హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. సీతానగరం మండలంలోని చెల్లం నాయుడువలస గ్రామానికి చెందిన యువకుడిగా మృతుడిని గుర్తించినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ ఢీకొందని, ఈ విషయమై లోకో పైలట్ ఫిర్యాదు చేశారని హెచ్‌సీ తెలిపారు.

మల్లన్న తలపాగా ఊరేగింపు


రాజాంలో మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న భక్తులు, చేనేత కార్మికులు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని మల్లికార్జునకాలనీలో శ్రీశైలం మల్లికార్జున స్వామికి శివరాత్రి పర్వదినాన సమర్పించాల్సిన తలపాగాను సోమవారం ఊరేగించారు. తొలుత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 8న శివరాత్రి పర్వదినాన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి తలపాగాను అలంకరిస్తామని చేనేత కార్మికులు చల్లా జయరాం, రమ, చల్లా షన్ముఖరావు, పావని తెలిపారు.

చిన్నమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారిని గ్రామంలోకి తీసుకొస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో చిన్నమ్మతల్లి ఉత్సవాలు జరగనున్నవి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి మేళతాళాలతో చిన్నమ్మతల్లిని గ్రామంలోకి తీసుకొచ్చారు. అమ్మవారి రాకతో గ్రామంలో పండగ వాతావరణం మొదలైంది. 18న తొలేళ్లు, 19న పెద్దపండుగ, 20వ తేదీన అనుపోత్సవం నిర్వహిస్తారు.

కరాటే క్రీడాకారుడికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికై న జుత్తాడ జగదీష్‌కు జెడ్పీ నిధుల నుంచి రూ.75వేల చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు సోమవారం అందజేశారు. ఎస్.కోట మండలం రాజీపేట గ్రామానికి చెందిన జుత్తాడ జగదీష్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మలేషియాలో జరగబోయే కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడనున్నాడు. జగదీష్‌ను జెడ్పీ చైర్మన్ అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ సిద్ధం

- 6న కరవు సాయం, మిచాంగ్ తుపాను పరిహారం నిధులు జమ
- జిల్లాకు రూ.14.75 లక్షలు విడుదల

సాక్షి, పార్వతీపురం మన్యం: అందరికీ అన్నం పెట్టే రైతన్నే తనకు తొలి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చాటిచెబుతున్నారు. ఇటీవలే వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ పథకం కింద ఐదో ఏడాది మూడో విడతలో రూ.29 కోట్లను జిల్లా రైతుల ఖాతాలకు జమచేశారు. సున్నా వడ్డీ రాయితీ నిధులను సైతం విడుదల చేశారు. వారం తిరగకముందే మరో సాయం వారి ఖాతాల్లోకి వేసేందుకు సిద్ధమయ్యారు. వర్షాభావం కారణంగా 2023 ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కరవుతో పాటు, 2023-24 రబీ సీజన్ ఆరంభంలో మిచాంగ్ తుపానుతో పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరి హారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 6వ తేదీన బటన్ నొక్కి బాధిత రైతుల ఖాతాలకు నేరుగా సాయాన్ని జమ చేయ నున్నారు. వాస్తవానికి కరవు, మిచాంగ్ ప్రభావం మన జిల్లాలో అంతగా లేనప్పటికీ.. ఒక్క రైతూ నష్టపోకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం నిధులను సమయానికి విడుదల చేస్తోందని ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు.

అండగా నిలుస్తున్న జగన్ ప్రభుత్వం

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఆ సీజన్ ముగియ కుండానే పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వర్షపాతం, పంట విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, జల ప్రవాహం, భూగర్భ జలాలు, జలాశయాల స్థాయిలు వంటివి ఆధారంగా కరవు మండలాలను గుర్తిస్తున్నారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోవాలి. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అంచనా వేసి ప్రతిపాదనలు పంపుతారు. అదే విధంగా మిచాంగ్ తుపాను కారణంగా 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతిన్న పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 61 గ్రామాల పరిధిలో 88.778 హెక్టార్లలో పరిహారం పంపిణీకి వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపారు. మొత్తం 259 మంది బాధిత రైతులను గుర్తించగా.. వీరికి రూ.14.755 లక్షలు మంజూరయ్యాయి. ఎక్కువగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను కోల్పోయారు. వీరికి ఈ నెల 6వ తేదీన పరిహా రం పంపిణీ చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ తెలిపారు.

యల్లారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ


జాతర ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: ఈనెల 16తేదీ నుంచి మూడురోజుల పాటు జరగనున్న జామి యల్లారమ్మ జాతరకు అధికారులు ముందస్తుజాగ్రత్తలు తీసుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎండోమెంట్ విభాగం చేస్తున్న ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందుస్తుగా అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ విస్తరణాధికారి శ్రీదేవి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడతామని, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి సామ్రాజ్య లక్ష్మి జాతరలో 108 వాహనం అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్యశిబిరం నిర్వహిస్తామని చెప్పారు. జాతరకు అదనంగా 8 ఆర్టీసీ బస్సులు నడుపుతామని అవసరమైతే మరిన్ని అదనపు బస్సులు వేస్తామని ఆర్టీసి అధికారులు తెలిపారు.

విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్‌శాఖ అధికారులు శాఖపరంగా జాతరకు చేపట్టబోయే ఏర్పాట్లపై సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ తిరుమలరావు, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, ఎండోమెంట్ ఈఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిత

- జేఎన్‌టీయూ జీవీలో మెకనో టెక్నికల్ సింపోజియం ప్రారంభం



విద్యార్థులు రూపొందించిన సావనీర్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం అర్బన్: పారిశ్రామిక రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో మెకానికల్ ఇంజినీరింగ్ కీలకం కానుందని, ఆ విభాగం విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న జాతీయస్థాయి 'మెకెనో ఎంఎండబ్లెక్స్ఐవీ' టెక్నికల్ సింపోజియం సోమవారం ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జయసుమ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన విశాఖ నావల్ డాక్‌యార్డ్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం అసిస్టెంట్ మేనేజర్-2 ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జీవిత లక్ష్య సాధనకు విద్యార్థిదశ కీలకమన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు లీడర్ షిప్ క్వాలిటీస్‌ను పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు వి.మణికుమార్, డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు కె.బాలాఆదిత్య, పి.జ్ఞానశరణ్య, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.